ప్రజా సమస్యల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం

హిమాయత్‌నగర్, జూలై 14: ప్రజా సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తున్నాయని సీపీఐ నగర కార్యదర్శి ఎస్. ఛాయదేవి అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఎన్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ముందు పేదలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు అమలు చేయాలని అన్నారు. వర్షాకాలం ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. మూసీ నది పరీవాహక ప్రాంతాల్లో నివాసం ఉండే పేదలకు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. దోమల వల్ల వచ్చే మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడు వాపు, బోధకాలు వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా బస్తీలు, కాలనీలో మెడికల్ క్యాంప్‌లను నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేడు బంజారాహిల్స్‌లో యువజనోత్సవాలు

జూబ్లీహిల్స్, జూలై 14: సెట్విన్ ఆధ్వర్యంలో నేడు ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం నిర్వహించనున్నారు. బంజారాహిల్స్‌లోని సేవాలాల్ బంజారా భవన్‌లో ఉదయం 11 గంటలకు వేడుకలను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నట్లు సెట్విన్ ఎండీ వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సెట్విన్ పర్యావరణ సంస్థలు ప్రదర్శనలు, బ్యూటీషియన్ విద్యార్థులతో బ్రైడ్స్ ఆఫ్ ఇండియా షోతో పాటు తెలంగాణ చేనేత వస్త్రాలు, పోచంపల్లి, గద్వాల్, నారాయణపేట, గొల్లభామ చీరలతో ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థుల సంప్రదాయ ఫ్యాషన్ షో ఉంటుందని వెల్లడించారు.

వేడుకల్లో ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, కార్పొరేటర్ కవితారెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, మీర్జా రెహ్మత్ బేగ్ ఖాద్రి, రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎ.వాణీప్రసాద్ పాల్గొంటారని తెలిపారు.

వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలి

ఉచిత వైద్య శిబిరంలో ఎమ్మెల్యే శ్రీ గణేష్

మారేడ్‌పల్లి, జూలై 14 : ప్రజలందరూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. ఆదివారం కంటోన్మెంట్ మూడో వార్డు కార్ఖానాలోని జామా మసీద్‌లో డాక్టర్ గొల్లపూడి అమర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత బ్రేస్ డెంటల్ శిబిరాన్ని ఎమ్మెల్యే శ్రీ గణేష్ హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలను అందించడానికి డాక్టర్ అమర్ ప్రసాద్ ముందుకు రావడం ఎంతో అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని వైద్య శిబిరాలను కంటోన్మెంట్‌లోని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసి పేద ప్రజలకు సేవలందించాలని సూచించారు.

అనంతరం జామా సమీదులో అల్లాను దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే శ్రీ గణేష్ కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జామా సమీద్ కార్ఖానా ప్రెసిడెంట్ మీర్జా గౌడ్, హైమద్, రషీద్ ఖాన్, సయ్యద్ ఇఫ్తా రుద్దీన్, మహ్మద్ ఆరోన్, జావిద్, అజార్, నవాబ్, ఆరిఫ్, కరీంద, మజార్, రహీం తదితరులు పాల్గొన్నారు.

కార్ఖానాలోని జామా మసీద్‌లో ఏర్పాటు చేసిన ఉచిత బ్రేస్ డెంటల్ వైద్య శిబిరంలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

రెజిమెంటల్‌బజార్‌లో గండి మైసమ్మ అమ్మవారి ఘటానికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్, నాయకులు, తదితరులు

మారేడ్‌పల్లి, జూలై 14: గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు అల్లాడి గౌరీశంకర్ ఆధ్వర్యంలో ఆదివారం రెజిమెంటల్‌బజార్‌లోని శ్రీ గండి మైసమ్మ అమ్మవారి ఘటం పూజా కార్యక్రమం వైభవంగా జరిగాయి. ఈ పూజా కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారి ఘటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంటోన్మెంట్ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఘటానికి గౌరీశంకర్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులందరికీ ప్రసాదాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు సీఎన్. నర్సింహముదిరాజ్, నాయకులు బాబురావు, నందికంటి రవి, ముప్పిడి మధుకర్, బద్రినాథ్ యాదవ్, సి. సంతోష్ యాదవ్, సదానంద్, తేలుకుంట సతీష్ గుప్త, రంగా రవీందర్‌గుప్త, రేపాల వెంకటేశ్వర్లు, తేజ్‌పాల్, బద్దం బల్వంతరెడ్డి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహేంద్రాహిల్స్‌లోని శ్రీ జగన్నాథ్ మందిర్ నుంచి ప్రారంభమైన రథ యాత్ర

భక్తులకు ఇబ్బందులు లేకుండా జగన్నాథ రథయాత్ర

మారేడ్‌పల్లి, జూలై 14: మహేంద్రాహిల్స్‌లోని శ్రీ జగన్నాథ్ మందిర్, గోశాల 32వ చారియాట్ ఫెస్టివల్ ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు శ్రీ జగన్నాథ్ మందిరంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. ఆలయం నుంచి ఉదయం ప్రారంభమైన స్వామి వారి రథయాత్ర కంటోన్మెంట్ పార్కు, ధన లక్ష్మి కాలనీ, సత్యనారాయణ టెంపుల్, గణేష్ ఆలయం మీదుగా ఈ రథయాత్ర కొనసాగింది. భక్తి, భజన గేయాలతో ఆలయ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తుకారం గేట్ పోలీసులు బందోస్తును ఏరాటటు చేశారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

వినోభానగర్ బస్తీలో సమస్యలు పరిష్కరించండి

డిప్యూటీ మేయర్‌ను కోరిన బస్తీవాసులు

డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వినోభానగర్ బస్తీ వాసులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 14: తార్నాక డివిజన్ వినోభానగర్ బస్తీలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని బస్తీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం బస్తీ వాసులు మాట్లాడుతూ.. తమ బస్తీలో విషపూరితమైన పాములు సంచరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పిల్లలు, మహిళలు, వృద్ధులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని వాపోయారు. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన డిప్యూటీ మేయర్ సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



రియాజ్‌కు అభినందనలు

తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రియాజ్‌ను ఓయూ జేఏసీ చైర్మెన్ కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు చంద్రశేఖర్, శివశంకర్, రవి, రాజు, నవీన్, ప్రవీణ్, రాజేందర్, శ్రీనివాస్, మహేశ్, ప్రశాంత్, చందు తదితరులు పాల్గొన్నారు. – ఉస్మానియా యూనివర్సిటీ

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

హైదరాబాద్ రోడ్ల ఫుట్‌పాత్‌లపై ఉండే అనాథలకు, అభాగ్యులకు, నిరాశ్రయులకు ఆదివారం స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నగరంలో ప్రత్యేక వాహనంలో సంచరిస్తూ అన్నార్థులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు సంజీవ కుమార్, పాల్గొని అన్నదానం చేశారు. –బన్సీలాలోపేట్

పేద విద్యార్థులకు సాయం అభినందనీయం

ఖైరతాబాద్: పేద విద్యార్థులకు ఎంఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ అన్నారు. లక్డీకాపూల్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 300 మంది పేద విద్యార్థులకు సహాయత చెక్కులను ట్రస్ట్ నిర్వాహకులు శివారెడ్డి, జ్యోతివాస్తు పండితులు డాక్టర్ జీవీ వరప్రసాద్‌తో కలిసి అందజేశారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. రెండేండ్లుగా ట్రస్ట్ ద్వారా ప్రతి ఏడాది వెయ్యి మంది పేద పిల్లల చదువుకు ఆర్థిక సాయం అందించడం గొప్ప విషమన్నారు. వారి సేవలు మరింత విస్తరించాలన్నారు. శివారెడ్డి మాట్లాడుతూ పేదలకు సేవ చేసుకునే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాని తెలిపారు. పది, ఇంటర్‌లో మంచి మార్కులు వచ్చి పై చదువులకు స్తోమతలేని వెయ్యి మంది పేద విద్యార్థులకు ప్రతి ఏటా రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నానని తెలిపారు.

కంటోన్మెంట్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం

నిధులు కేటాయించలేదు

బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

బోయిన్‌పల్లి సంజీవయ్య నగర్ కాలనీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న బోర్డు నామినేటెడ్ సభ్యుడు జే.రామకృష్ణ

బొల్లారం,జూలై 14:కంటోన్మెంట్ అభివృద్ధికి నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జే.రామకృష్ణ అన్నారు.ఆదివారం నియోజకవర్గంలోని బోయిన్‌పల్లి సంజీవయ్యనగర్ కాలనీ,కార్ఖానా,ఐదో వార్డులోని వాసవీ నగర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వ నిధులతోనే కంటోన్మెంట్ అభివృద్ధి జరుగుతుందని,రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ అభివృద్ధికి నయా పైసా కేటాయించడం లేదని పేర్కొన్నారు.ఈ మధ్య కొత్తగా పుట్టుకొచ్చిన నాయకులు కాలనీల్లో తిరుగుతూ ఫ్యాషన్ షోలు చేస్తున్నారు కానీ, ఒక్క సమస్యకు కూడా పరిష్కారం చూపడం లేదని విమర్శించారు.రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొచ్చి కంటోన్మెంట్ అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయానంద్,నర్సింగ్ రావు,బీఎన్ శ్రీనివాస్,శంకర్,కిరణ్ కుమార్,అరుణ్,విజయ్ యాదవ్,వీరేందర్, అశోక్,శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నల్లకొడిసె వన్నెకాడు'

పుస్తకావిష్కరణ

నల్లకొడిసె వన్నెకాడు వాడుక భాష కవిత్వమని ప్రముఖ కవి కె. శివారెడ్డి అన్నారు. కవి నాగిళ్ల రమేశ్ రచించిన 'నల్లకొడిసె వన్నెకాడు' పుస్తకావిష్కరణ సభ ఆదివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. కవి యాకూబ్ సభాధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా కవి కె.శివారెడ్డి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా.మామిడి హరికృష్ణ, డా.కోయి కోటేశ్వరరావులు విచ్చేసి పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం ఈ కవితా సంపుటిని తన మిత్రుడు జబ్బు వెంకటేశ్‌కు అంకితం ఇచ్చారు. పల్లిపట్టు నాగరాజు, వనపాకల దిలీప్, తగుళ్ల గోపాల్,పేర్ల రాము, గుర్రాల అనూష తదితరులు పాల్గొన్నారు. – రవీంద్రభారతి,జూలై14

ఎస్సీ హాస్టల్‌ను తక్షణమే రీ ఓపెన్ చేయాలి

కాచిగూడ,జూలై 14: ఐదు సంవత్సరాలుగా మూతపడిన నింబోలిఅడ్డాలోని ఎస్సీ హాస్టల్‌ను తక్షణమే రీ ఓపెన్ చేయాలని కాచిగూడ హాస్టల్ రీ ఓపెన్ పోరాట సమితి ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సమితి ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు హాస్టల్‌ను సందర్శించి, నిరసన తెలిపారు.

ఉజ్జయినీ మహంకాళికి బోనాల సమర్పణ

మహంకాళి దేవాలయంలో భక్తుల సందడి

బేగంపేట్, జూలై 14: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని బోనాలను సమర్పించారు. జోగిని శ్యామల అమ్మవారికి హుషారెత్తించే నృత్యాలతో సందడి చేస్తూ అమ్మవారి దేవాలయానికి బోనంతో వచ్చారు. ఈ క్రమంలో అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. దీంతో మహంకాళి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. మాజీ కార్పొరేటర్ అతెల్లి అరుణ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఓల్డ్ బోయిగూడలోని వారి నివాసం నుంచి అమ్మవారి బోనాన్ని అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో సాయికిరణ్‌యాదవ్ అమ్మవారికి పూజలు చేశారు. ఈ క్రమంలో పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ప్రతి ఏటా అమ్మవారి జాతరకు ముందు మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది.

మహంకాళి అమ్మవారికి బోనం తీసుకెళ్తున్న జోగిని శ్యామల

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానం

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బోనాలకు రావాల్సిందిగా ఆహ్వానం పలుకుతున్న ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి

ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర ఉత్సవాలకు రావాల్సిందిగా మహంకాళి అమ్మవారి దేవాలయం ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానం పలికారు. సెక్రటేరియేట్‌లోని మంత్రి చాంబర్‌లో కలిసి ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయం అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

గోదావరిలా..రహదారులు: ఆదివారం సాయంత్రం హైదరాబాద్ తడిసి ముద్దయింది. నగరంలో భారీగా వర్షం కురవడంతో రహదారులన్నీ వరదతో పోటెత్తింది. దీంతో అమీర్‌పేటలో ఏ రహదారి చూసినా గోదావరిలా దర్శనమించింది. నగర ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

'మొక్కలు నాటుదాం-పర్యావరణాన్ని పరిరక్షిద్దాం'

అమీర్‌పేట్, జూలై 14 : జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ సహకారంతో కాండ్రాజు సుబ్బరాజు చారిటబుల్ ఫౌండేషన్, విశ్వమానవ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జెక్‌కాలనీలో వన మహోత్సవం జరిగింది. కాలనీలోని అన్ని రోడ్లలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో కాలనీవాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. 'మొక్కలు నాటుదాం–పర్యావరణాన్ని పరిరక్షిద్దాం' అంటూ కాలనీ నివాసితులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఇంతటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కాండ్రాజు సుబ్బరాజు చారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షులు కొండ్రాజు సుబ్బరాజు, డైరెక్టర్లు కె.సురేందర్‌రాజు, కె.శ్రీనివాస్‌రాజులను కాలనీ ఫెడరేషన్ అధ్యక్షులు డాక్టర్ మల్లు ప్రసాద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వమానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పి.మస్తాన్‌రావు, అధ్యక్షులు సోమ వెంకట్‌లతో పాటు మాజీ కార్పొరేటర్ కంజర్ల సదాశివయాదవ్, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణ, ఫెడరేషన్ మాజీ అధ్యక్షులు చింతిరెడ్డి అనంతరెడ్డి సహా ఫెడరేషన్ సభ్యులు విశ్వనాథరాజు, శ్రీహరి కాలనీ నివాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జెక్‌కాలనీ 1లో మొక్కలు నాటుతున్న దృశ్యం

అందుబాటులో మొక్కలు..

జెక్‌కాలనీ నివాసితుల కోసం మొక్కలు అందుబాటులో ఉంచామని ఫెడరేషన్ అధ్యక్షులు డాక్టర్ మల్లు ప్రసాద్ పేర్కొన్నారు. కాలనీలోని ఫెడరేషన్ కార్యాలయంలో ఈ మొక్కలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

మేడిబావిలో సమస్యలపై దృష్టి పెట్టండి

సికింద్రాబాద్,జూలై14: సీతాఫల్‌మండి మేడిబావి కాలనీ హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ప్రభుత్వ వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మేడిబావి ఆర్య సమాజ్ ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో స్థానికులు చెప్పిన సమస్యలను ఆలకించిన ఆయా శాఖల అధికారులు వాటిని త్వరగా పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. కాలనీలో పోకిరిల బెడద అధికంగా ఉందని, గంజాయి బ్యాచ్‌లను అరికట్టాలని పలువురు ఈస్ట్ జోన్, చిలకలగూడ ఏసీపీ జైపాల్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలను అమర్చుకుంటే, వాటిని పోలీస్ స్టేషన్ కమాండ్ సెంటర్‌కు అనుసంధానం చేసి, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూస్తామన్నారు. అదేవిధంగా తక్కువ ప్రెషర్‌తో తాగునీరు సరఫరా అవుతున్నదని జల మండలి అధికారులకు వివరించారు. ఉచిత కరెంట్ స్కీం తమకు వర్తించడం లేదని పలువురు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ సమావేశంలో ఈస్ట్ జోన్ ,చిలకలగూడ ఏసీపీ జైపాల్ రెడ్డి,చిలకలగూడ సీఐ అనుదీప్, వాటర్ వర్క్స్ ఏఈ అన్విత్, ఎలక్ట్రిసిటీ అధికారులు ,అసోసియేషన్ ప్రెసిడెంట్ కామిశెట్టి రవి కుమార్, జనరల్ సెక్రటరీ ఆదూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు లక్ష్మీరెడ్డి, బోనగిరి శ్రీను, కొండల్ వెంకటేశ్వర్ రావు, యాదగిరి, యశ్వంత్, ఆర్య సమాజ్ ప్రెసిడెంట్ ఎం.ఆర్.రవీందర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి